## కొనుగోళ్లలో వేగం పెంచాలి

• వీసీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఎల్లారెడ్డిపేట తహసీల్దారు కార్యాలయం నుంచే వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మే నెలలో కేంద్రాలకు ధాన్యం అధికంగా రానున్న నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, కేంద్రాల వద్ద ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. కొనుగోళ్ల విషయంలో రైతులు ధర్నా చేసే పరిస్థితి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా అవసరాన్ని బట్టి ఇంటర్మీడియట్ గోదాములు కేటాయించాలని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ రైస్‌మిల్లరు నిబంధనల ప్రకారం నడుచుకునేలా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ సమస్య, హమాలీల కొరత సమస్య లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాలన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ మాట్లాడుతూ జిల్లాలో 256 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఇప్పటి వరకు 65వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. రవాణాకు ఇబ్బందులు లేవన్నారు. గన్నీ బ్యాగులను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని చెప్పారు.

## లక్ష్యం మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 30: జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. బుధవారం ఇందిరమ్మ ఇండ్ల పథకంపై జిల్లాలోని ఆయా మండలాలు, మున్సిపాలిటీల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి..? ఎన్ని సర్వే చేశారు..? ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారో హౌసింగ్ పీడీ శంకర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేదల సొంత ఇంటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, అర్హులకే అందేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే నెల 2న ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల వార్డుల్లో దరఖాస్తుదారుల జాబితా ప్రదర్శిస్తారని, 5న తుది జాబితా విడుదల చేస్తారని కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఆర్‌డీవో శేషాద్రి, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ‘పది’ ఫలితాల్లో సత్తా



ఇల్లంతకుంట: ఉత్తమ మార్కులు సాధించిన రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థులు

• జిల్లాకు రాష్ట్రంలోనే ఐదో స్థానం
• 6,754 మంది విద్యార్థులకు 6,629 మంది ఉత్తీర్ణత
• ప్రతిభచూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో జిల్లా సత్తాచాటింది. రాష్ట్రంలోనే 98.15శాతం ఉత్తీర్ణతతో ఐదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రావు జిల్లాలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6754మంది విద్యార్థులు (బాలురు 3119, బాలికలు 3635)పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 6629 మంది (బాలురు 3041, బాలికలు 3588మంది) ఉత్తీర్ణత సాధించారు. జిల్లా కేంద్రంలోని ఇంగ్లిష్ యూనియన్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై కరస్పాండెంట్ రాజుకుమార్ అభినందనలు తెలిపారు.

### ఇల్లంతకుంటలో 98.70 శాతం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 30: మండలంలో 463 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 457 మంది (98.70 శాతం) ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు ఎన్ నిత్య 566, ఏ అర్పిత 564 మార్కులు సాధించారు. రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థులు స్వేతా రెడ్డి 573, కే స్వర్ణిక 573, ఎ అశ్విత 573, వర్షిణి 569 మార్కులు సాధించారు. వెల్జిపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో తెలిపారు.

### రుద్రంగిలో 97శాతం..

రుద్రంగి, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణతతో ప్రతిభ చూపారు. మొత్తం 179 మంది మంది పరీక్షలు రాయగా, 174 మంది ఉత్తీర్ణత సాధించారు. రుద్రంగిలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన పీ జాహ్నవి 561 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. 559 మార్కులతో కేజీబీవీ పాఠశాలకు చెందిన వీ శ్రావన్య, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఎం హాసిని ద్వితీయ స్థానంలో నిలువగా, ఉపాధ్యాయులు అభినందించారు.

### శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విజయభేరి

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 30: టెన్త్ ఫలితాల్లో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వంద శాతం ఉత్తీర్ణతతో విజయభేరి మోగించిందని ప్రిన్సిపాల్ పల్ల రాజురెడ్డి తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

### కోనరావుపేటలో 98.3 శాతం..

కోనరావుపేట, ఏప్రిల్ 30: పది ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 414మంది పరీక్షలు రాయగా, 375 మంది ఉత్తీర్ణత (98.3 శాతం)సాధించారని ఎంఈవో మురళీ నాయక్ తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పస్తం అక్షయ 560 మార్కులు, సుద్దాల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన సాయితేజ 554 మార్కులతో మండలంలోనే రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

### వేములవాడ విద్యార్థుల ప్రతిభ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 30: వేములవాడ రూరల్ మండలంలో మర్రిపల్లి, చెక్కపల్లి, వట్టెంల జిల్లా పరిషత్ పాఠశాల, మర్రిపల్లి కేజీబీవీ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. హన్మాజీపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ప్రఫుల్ కుమార్ 552, ఆకుల వశిష్ట 549, జంకే శ్రీనిధి 548 మార్కులు సాధించగా, ఎంఈవో కిషన్, మాజీ ఉపసర్పంచ్ జంకె మధు అభినందించారు. వేములవాడ అర్బన్ మండలంలో రుద్రవరం, శాత్రాజుపల్లి పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. చీర్లవంచ పాఠశాలకు చెందిన కె బన్నీ 563, రుద్రవరం పాఠశాలకు చెందిన ఎం వర్షిత 524 మార్కులు సాధించారు. విద్యార్థులను ఎంఈవో బన్నాజీ అభినందించారు.

### చందుర్తిలో 96.7శాతం



ఎస్ వైశాలి

చందుర్తి, ఏప్రిల్ 30: మండలంలోని 245 మంది విద్యార్థులు హాజరుకాగా 238 మంది (96.7 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వినయ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. మూడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ వైశాలి 568 మార్కులతో మండల టాపర్ గా నిలువగా, మల్యాలకు చెందిన డీ అనిరుధ్ 565, సనుగులకు చెందిన ఏం.అక్షయ 557 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలువగా, ఎంఈవో అభినందించారు.

### విద్యార్థినికి సన్మానం

బోయినపల్లి, ఏప్రిల్ 30: పది ఫలితాల్లో 567 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన మోడల్ స్కూల్‌కు చెందిన కే.అక్షితను ప్రిన్సిపాల్ రఘునాథ్, ఉపాధ్యాయులు అభినందించి, సన్మానించారు. మండలంలో 330 మంది మంది పరీక్షలు రాయగా 329 మంది (99.6 )ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

### ఎల్లారెడ్డిపేటలో 95 శాతం..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: పది ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులు సత్తాచాటారు. 405 మంది పరీక్షలు రాయగా 386 మంది(95శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కృష్ణహరి తెలిపారు. ఇందులో దుమాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఆర్. అర్పిత మొదటి ర్యాంకు సాధించినట్లు చెప్పారు.

## సెస్ ఉద్యోగులకు అండగా ఉంటాం

• డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి • బాధిత కుటుంబ సభ్యుడికి ఉద్యోగ నియామక పత్రం అందజేత



ఆర్డర్ కాపీని అందజేస్తున్న డైరెక్టర్ అంజిరెడ్డి, సభ్యులు

ముస్తాబాద్, ఏప్రిల్ 30: వినియోగదారులకు సేవలందిస్తున్న సెస్ ఉద్యోగులకు పాలకవర్గం అండగా ఉంటుందని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. చిప్పలపల్లి గ్రామానికి చెందిన జెల్ల లింగయ్య ముస్తాబాద్ సెస్ కార్యాలయంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే లింగయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న తోటి ఉద్యోగులు, పాలకవర్గం చలించిపోయింది. అతని కొడుకు భాను ప్రసాద్‌కు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇస్తూ, ఆర్డర్ కాపీని బుధవారం అందించినట్లు అంజిరెడ్డి తెలిపారు. భాను ప్రసాద్ మాట్లాడుతూ తన కుటుంబానికి అండగా నిలిచి ఉద్యోగం కల్పించిన సెస్ డైరెక్టర్, ఏఈ విష్ణుతేజకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిప్పలపల్లి గ్రామ మాజీ సర్పంచులు గాడిచర్ల దేవయ్య, తాడేపు జ్యోతి ఎల్లం, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ కొమ్మటి రాజమల్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మాచేటి లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

## భూభారతితో సమస్యల పరిష్కారం

• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ • ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిలో అవగాహన సదస్సులు



ఎల్లారెడ్డిపేటలో వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట/ వీర్నపల్లి, ఏప్రిల్ 30: భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పేర్కొన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పేర్లు తప్పుగా పడినా, 30 రోజుల్లో సరిచేసి సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. ప్రతి గ్రామంలో నాలుగు రకాల రిజిస్టర్లను మెయింటేయిన్ చేస్తారని, మొదటిది విలేజ్ రిజిస్టర్, రెండోది గవర్నమెంట్ ల్యాండ్ రిజిస్టర్, మూడోది అమెండ్‌మెంట్ రిజిస్టర్, ఇరిగేషన్ రిజిస్టర్ ఉంటుందని, ఎక్కడ ఎలాంటి భూమి ఉందో తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. విరాసత్, తప్పుల సవరణ తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో అయిపోయేలా భూభారతి చట్టం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం ఎల్లారెడ్డిపేటలో ఆర్డీవో రాధాబాయి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. కాగా, వీర్నపల్లిలో పలువురు భూములకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించగా, పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ ఏఎంసీ చైర్‌పర్సన్ సాబెరా భేగం, తహసీల్దారు సుజాత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. వీర్నపల్లిలో తహసీల్దార్ ముక్తర్‌పాషా, ఏఎంసీ వైస్ చైర్మన్ లెంకల లక్ష్మణ్, నేతలు తిరుపతి, దినకర్ ఉన్నారు.

## కొనుగోళ్లలో ఆలస్యం.. ధాన్యం మాయం

• 5 బస్తాల వడ్లు ఎత్తుకెళ్లిన దొంగలు • లబోదిబోమంటున్న రైతు • బొప్పాపూర్‌లో ఘటన



ధాన్యం వద్ద దీనంగా గోపాల్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: కొనుగోళ్లలో ఆలస్యం.. రైతులకు శాపంగా మారుతున్నది. ఓ వైపు అకాల వర్షాల భయం వెంటాడుతుండగా, మరోవైపు దొంగలు బెడద పెరుగుతున్నది. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ఏఎంసీ గోదాం పక్కన రైతు నీరటి గోపాల్ పది రోజుల కింద ఎండబోసిన ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం వెలుగు చూసింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం 10 రోజుల క్రితం ఏఎంసీ గోదాం వద్దకు ధాన్యం తీసుకువచ్చి ఎండబోశానని, బుధవారం తెల్లవారుజామున వచ్చి చూస్తే తెచ్చిన ధాన్యంలో సగం పోయిందని వాపోయాడు. సకాలంలో కొనుగోళ్లు జరుగక పోవడం వల్లే చోరీకి గురైనట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఐకేపీ ఏపీఎం మల్లేశంను వివరణ కోరగా గోపాల్ తన ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పోయలేదని, ఏఎంసీ గోదాము వద్ద పోశాడని, సదరు సమాచారాన్ని తమ సిబ్బందికి తెలియజేయలేదని చెప్పారు. పది బస్తాల ధాన్యం ఎండబోయగా, అందులో నుంచి ఐదు బస్తాలు చోరీకి గురైనట్లు గుర్తించామని తెలిపారు. కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, ఎక్కడా ఆలస్యం లేదని, గోపాల్‌కు ఇచ్చిన నంబర్ ప్రకారం తూకం వేస్తామని వివరించారు.

## ‘లింగ నిర్ధారణ’ చేస్తే కఠిన చర్యలు

• వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత



సభ్యులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో రజిత

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తప్పవని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ రజిత హెచ్చరించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పీసీపీ ఎన్‌డీటీ జిల్లా అడ్వైజరి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు దవాఖానల్లో స్కానింగ్ పరీక్షలు చేస్తున్న వారెవరు లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే స్కానింగ్ కేంద్రాలు, దవాఖానలను సీజ్ చేయడంతో పాటు జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తారని చెప్పారు. గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినపుడు కడుపులోని బిడ్డ ఆడ, మగ నిర్ధారిస్తూ చెప్పరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజలీ, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాశ్‌శుక్లా, ఎన్జీవో కమిటీ సభ్యురాలు ఝాన్సీలక్ష్మీబాయి. డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, బాలయ్య, డీఇఓ మహేశ్ ఉన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు: ఎస్ఈ

ముకరంపుర, ఏప్రిల్ 30: వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా లోడ్ పెరిగే అవకాశం ఉన్న రాచర్ల తిమ్మాపూర్, మోహినికుంట, జేపీ నగర్, బోనాల, మల్లారం, రేణికుంటలో 5ఎంవీఏ, కరీంనగర్ టౌన్ బ్యాంక్ కాలనీలో 12.5ఎంవీఏ కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ టౌన్‌లో ఉజ్వల పార్క్, వాటర్ వర్క్స్, ఎస్సారార్, ఖాజీపూర్, వీర్నపల్లి, నవాబ్ పేట్‌లో పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏకు పెంచామని తెలిపారు. సప్తగిరి కాలనీ, సాయి నగర్( ఖాజీపూర్ –2) లో 8ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు, కోర్కల్, వట్టెములలో 3.15ఎంవీఏ నుంచి 5ఎంవీఏ పెంచినట్లు తెలిపారు. కరీంనగర్ టౌన్, ఖాజీపూర్ (బావుపేట), చిగురుమామిడి, సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రాంతాల్లో పీటీఆర్‌లను కొత్తగా ఏర్పాటు చేయడం, సామర్థ్యం పెంచడంతో సరఫరాలో ఇబ్బందులను అధిగమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు కొత్తగా 292 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయగా 319 ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 6 వీసీబీ (వాక్యూమ్ సర్క్యూట్ (బ్రేకర్)లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా కరీంనగర్‌లో ఎనిమిది సబ్ స్టేషన్ల పరిధిలో 21 కిలోమీటర్లు, సిరిసిల్ల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటర్ లింకింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. వోల్టేజ్ హెచ్చు తగ్గుల నియంత్రణకు 600కే వీఏఆర్ సామర్థ్యం ఉన్న 23కెపాసిటర్ బ్యాంకులతో పాటు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లలోనూ కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




## అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

• రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్



గాలిపెల్లిలో మాట్లాడుతున్న ఓరుగంటి ఆనంద్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 30: అందరి సహకారం ఉన్నప్పుడే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తాయని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం గాలిపెల్లి గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని, మాట్లాడారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కుల, మతాలకు అతీతంగా ఉండి గ్రామ అభివృద్ధికి సహకరించుకోవాలని సూచించారు. ఇక్కడ తహసీల్దార్ ఫారుక్, ఎంపీడీవో శశికళ, ఏఎస్ఐ ఫసియోద్దిన్, ఆర్ఐ, ఏఈవో అర్చన, పంచాయతీ కార్యదర్శి అనిల్, నాయకులు రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

## భవన నిర్మాణ రంగంలోనూ డ్రోన్‌ల వినియోగం

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 30: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నదని, ఈ క్రమంలో భవన నిర్మాణంలోనూ డ్రోన్ల వినియోగం పెరుగుతున్నదని వరంగల్ కిట్స్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజిత్ రెడ్డి తెలిపారు. బుధవారం సింగాపూర్ కిట్స్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఒక రోజు సెమినార్‌కు ముఖ్య వక్తగా హాజరై, డ్రోన్ టెక్నాలజీస్ ఫర్ ద కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ అంశంపై ఉపన్యసించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, సమన్వయ కర్త అధ్యాపకుడు మనోజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నిమ్మపల్లిలో ‘పోలీస్ మీకోసం’

కోనరావుపేట, ఏప్రిల్ 30: నిమ్మపల్లి గ్రామంలో పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి నిర్వహించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. ఎండ తీవ్రత నేపథ్యంలో విద్యార్థులను బయటికి వెళ్లకుండా చూడాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఇక్కడ పోలీసు సిబ్బంది ఉన్నారు.

### క్రీడలపై శిక్షణ తరగతులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 31 వరకు 14 ఏండ్లలోపు విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నామని మండల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో క్రీడలపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఎల్లారెడ్డిపేటలో దుకాణాల బంద్



ఎల్లారెడ్డిపేటలో మూసి ఉన్న దుకాణ సముదాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: పహల్గాంలో జరిగిన దాడికి నిరసనగా ఎల్లారెడ్డిపేటలో దుకాణాలు, హోటల్లు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బుధవారం పలు పార్టీలకు చెందిన నాయకులు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని దుకాణాలకు వెళ్లి మూసివేయించారు. బస్టాండులో ఏర్పాటు చేసిన పహల్గాం మృతుల చిత్రపటాల ప్లెక్సీ వద్ద నివాళులర్పించారు.

### సివిల్ రైట్స్ డే

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: కిష్టునాయక్ తండాలో పోలీస్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమ్మినవారిపై తీసుకునే చర్యలు, మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై అయ్యే కేసులు, కుల వివక్ష పాటిస్తే అయ్యే కేసుల గురించి అవగాహన కల్పించారు. ఇక్కడ జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బోయినిపల్లి, ఏప్రిల్ 30: జగ్గారావుపల్లిలో అధికారులు బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అంటరానితనం నేరమని, దళితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి భూమి పూజ

బోయినిపల్లి, ఏప్రిల్ 30: మల్లాపూర్ పంచాయతీ పరిధిలోని రేగులపల్లిలో కురుమ, యాదవ సంఘ భవన నిర్మాణానికి బుధవారం సంఘ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంజూరు చేసిన రూ.5లక్షల నిధులతో భవన నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మిరాజం, నాయకులు పోచమల్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బసవ జయంతి

కలెక్టరేట్, ఏప్రిల్ 30: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం బసవ జయంతి వేడుకలను నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ హాజరయ్యారు. ముందుగా బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహర్‌రావు, డీఆర్‌డీవో శేషాద్రి, కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### జూనియర్ సివిల్ జడ్జిగా జాహ్నవి



జాహ్నవి

వేములవాడ, ఏప్రిల్ 30: రాష్ట్ర జ్యుడిషియల్ సర్వీస్ నిర్వహించిన సివిల్ జడ్జి (జూనియర్ బెంచ్) పరీక్షలో వేములవాడ పట్టణానికి చెందిన జాహ్నవి అర్హత సాధించారు. పట్టణంలోని భీమేశ్వర ఆలయ వీధికి చెందిన సంకేపల్లి హరికిషన్ కూతురు జాహ్నవి ఉస్మానియా యూనివర్సిటీలో బీకాం, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2018లో రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్, వేములవాడ బార్ అసోసియేషన్‌లో ఆమె సభ్యత్వం పొందారు. ప్రస్తుతం న్యాయ శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తుండగా న్యాయమూర్తి కావాలనే లక్ష్యంతో నాలుగో ప్రయత్నంలో ఆమె జూనియర్ సివిల్ జడ్జిగా అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

### పోషకాహారంతోనే ఆరోగ్యం

ముస్తాబాద్, ఏప్రిల్ 30: పోషకాహారంతోనే ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలి పేర్కొన్నారు. ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని తెలిపారు. ముస్తాబాద్ అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలోని గ్రామాల్లోని అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషణ పక్వాడా కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు, అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవల గురించి వివరించారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### గంజాయి కేసులో వ్యక్తి రిమాండ్

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 30: నిషేధిత గంజాయిని సేవిస్తూ, విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నాయిని వివేక్‌రాజ్ గీతానగర్‌లో గల వినాయక నిమజ్జనం ప్రాంతంలో గంజాయిని సేవిస్తున్నాడు. అలాగే గంజాయిని విక్రయించేందుకు యత్నిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 50గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

### వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

ఇల్లందకుంట (హుజూరాబాద్ టౌన్), ఏప్రిల్ 30: ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామంలో బుధవారం వీధి కుక్క దాడి చేయగా బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన రాజు, వనిత దంపతుల కుమారుడు అయాన్(2) ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వీధి కుక్క దాడి చేసింది. అప్రమత్తమైన తల్లిదండ్రులు తీవ్ర గాయాలపాలైన బాలుడిని చికిత్స కోసం హుజూరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తీసుకువెళ్లారు. గ్రామ పరిధిలో ఇటీవల ఇద్దరు పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల నుంచి కాపాడాలని కోరుతున్నారు.